తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం
2 జూలై 2026
పేజీలు : 08
Follow :



# శివసాగర్‌లో యథేచ్ఛగా అక్రమ
# ఇసుక దందా

## అనుమతి 0.3 మీటర్లు.. తవ్వకం 10 అడుగులు

- ఎమ్మార్వో తీరుపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం
- 3 క్యూబిక్ మీటర్ల అనుమతికి 5000 టన్నుల తరలింపు
- ప్రాజెక్టు ఉనికికి ముప్పు.. విచారణ జరపాలి

**యాలాల జూలై 1 ( జనంసాక్షి ) :**

యాలాల మండలం శివసాగర్ ప్రాజెక్ట్ పరిధిలో అక్రమ ఇసుక తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు తూట్లు పొడిచి కోట్లాది రూపాయల ఇసుకను తరలిస్తున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ నాయకుల అండదండలతోనే ఈ దందా సాగుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అనుమతి 0.3 మీటర్లకు ఉండగా, తవ్వకం 10 అడుగులు.గత నెల జూన్ 16న విశ్వనాథపూర్‌కు చెందిన రైతు జి. శ్రీనాథ్ తన పొలానికి కేవలం 0.3 మీటర్లు, అంటే 3 అడుగుల మేర సిల్ట్ తరలించుకునేందుకు ఇరిగేషన్ ఈఈ నుండి అనుమతి పొందారు. అయితే నిబంధనలు ఉల్లంఘించి ఏకంగా 10 అడుగుల లోతు తవ్వి భారీగా ఇసుకను తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని యాలాల మండల బీఆర్ఎస్ నాయకులు ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు. 3 క్యూబిక్ మీటర్లకు అనుమతి

యాలాల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సి. రవీందర్ రెడ్డి ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రశ్నించగా వెటకారంగా మాట్లాడినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడి పేరుతో జరుగుతున్న ఈ అక్రమ దందాకు ఎమ్మార్వో కూడా పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక మాఫియా టిప్పర్ల కోసం ప్రాజెక్టులోకి నాప రాళ్ల వ్యర్థాలు డంప్ చేయడంతో శివసాగర్ ప్రాజెక్టు ఉనికికే ముప్పు ఏర్పడిందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భూమి కాజేసిన భూ బకాసురులు

- 8 గుంటల భూమి కుదువు పెట్టి అప్పు తీసుకున్న రైతును మోసం చేసిన మల్లేష్
- 36 - 22 గుంటల భూమి తన పేరున రిజిస్ట్రేషన్
- డబ్బులు చెల్లించినా పట్టా ఇవ్వకుండా దారుణం
- భూమి ఇవ్వండి లేదా ఆత్మహత్య చేసుకుంటామని రైతు కుటుంబం



లోపలి పేజిలో

# శేరిలింగంపల్లిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- మంచినీటి, భూగర్భ డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి
- జలమండలి అధికారులకు ఎమ్మెల్యే అరికపూడి గాంధీ విజ్ఞప్తి
- వర్షాకాలం ముందు సన్నద్ధతపై సమీక్ష
- ప్రజల సమస్యలకు తక్షణ స్పందన



# ప్రభుత్వ కార్యాలయాలలో పలు కీలక పోస్టులు ఖాళీ

- కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న ప్రజలు
- ఇన్చార్జులతో నెట్టుకొస్తున్న వైనం
- బదిలీ అయిన వారి స్థానంలో కొత్తవారు రాక ఇబ్బందులు
- నూతన మండలంలో పోస్టులు భర్తీ చేయాలని మండల వాసుల డిమాండ్





# ఏకరూప దుస్తులు ఇప్పట్లో లేనట్లే..!!

## బడి ప్రారంభమై 15 రోజులు గడిచిన విద్యార్థులకు అందని రెండు జతల బట్టలు

- కేజీబీవీ మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే విద్యార్థులకు దుస్తులు రెడీ
- పట్టణ మాత్మ గాంధీ జ్యోతిరావు పూలే విద్యార్థులకు రెడీ కానీ ఏకరూప దుస్తులు
- గత ఏడాది ఇచ్చిన ఒక జత యూనిఫామ్ తో పాఠశాలకు వస్తున్న విద్యార్థులు
- విద్యార్థులకు ఏకరూప దుస్తుల సరఫరాపై గందరగోళం

ఒకటి నుంచి ఇంటర్ విద్యార్థులకు దుస్తులు ఇప్పట్లో లేనట్లే మరో రెండు నెలలకు వచ్చే అవకాశం



## విద్యార్థుల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి



**తాండూరు జూన్ 30(జనంసాక్షి) :** విద్యార్థుల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్లు 7, 8, 9ను వెంటనే రద్దు చేసి, పాత విధానంలోనే ఫీజ్ రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, బీసీ సంఘం తాండూర్ నియోజకవర్గ కన్వీనర్, జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ నేతృత్వంలో సోమవారం తాండూర్ ఆర్డీవో కార్యాలయాన్ని బీసీ సంఘం నాయకులు ముట్టడించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ, 2008లో ఆర్. కృష్ణయ్య చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పథకం అమల్లోకి వచ్చిందని, ఈ పథకం ద్వారా లక్షలాది మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు ఉన్నత విద్యను పూర్తి చేసి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అన్నారు. అయితే 2021 నుంచి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి పెంచుతున్నాయని, దీంతో అనేక మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓలు 7, 8, 9 ప్రకారం విద్యార్థులే ఫీజులు చెల్లించి, తర్వాత డీబీటీ ద్వారా డబ్బులు పొందాలనే విధానం పేద విద్యార్థులకు భారమవుతుందని, కాలేజీలకూ ఇబ్బందులు కలిగిస్తుందని అన్నారు. ఈ జీవోలను వెంటనే రద్దు చేసి, పాత విధానంలోనే నేరుగా కాలేజీలకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. లేకపోతే ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేసి, అవసరమైతే తాండూర్ నుంచి వేలాది మంది విద్యార్థులతో అసెంబ్లీ, ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమాలు చేపడతామని రాజ్‌కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్ షుకుర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, మహిళా ప్రతినిధులు అనిత, నరసమ్మ, మంజుల, జగదీశ్వరి, వీరమణి, మీడియా ఇన్‌చార్జ్ బసవరాజ్, మండల అధ్యక్షులు నరేందర్, బసంత్, బీసీ విద్యార్థి నాయకురాలు మంజుల, యువ నాయకులు జోసఫ్, రాము ముదిరాజ్, బంగారు నవీన్, మంతన్ గౌడ్ అశోక్, టైలర్ రమేష్, బీటీ సురేష్, పోచయ్య, చిన్న, వివిధ కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిని 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేయాలి



**హయత్‌నగర్, జూలై 1 (జనం సాక్షి):**
హయత్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి, అన్ని విభాగాల్లో నిపుణులైన వైద్యులను నియమించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆస్పత్రిని సందర్శించిన సీపీఎం ప్రతినిధి బృందం అక్కడి సమస్యలను పరిశీలించి వైద్యాధికారులతో చర్చించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కేసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ రోజుకు 400 నుంచి 600 మంది వరకు రోగులు ఆస్పత్రికి వస్తున్నప్పటికీ అందుకు అనుగుణంగా పడకలు, వైద్య సిబ్బంది, మౌలిక వసతులు లేవని అన్నారు. స్కానింగ్, రేడియాలజీ, ఆర్థోపెడిక్, నేత్ర వైద్య నిపుణులను నియమించడంతో పాటు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యుల కొరత కారణంగా పలువురు రోగులను వనస్థలిపురం, ఉస్మానియా తదితర ప్రభుత్వ ఆస్పత్రులకు రిఫర్ చేయాల్సి వస్తోందని తెలిపారు.



ఆస్పత్రికి ప్రహరీ గోడ నిర్మించడం, తాగునీటి సమస్యను పరిష్కరించడం, మరుగుదొడ్లు, మూత్రశాలలను పెంచడం, అవసరమైన సిబ్బందిని నియమించడం వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వర్షాకాలంలో రోగుల సంఖ్య పెరగడంతో పడకలు సరిపోక హాలులోనే వైద్యం అందించాల్సిన పరిస్థితి నెలకొంటోందని పేర్కొన్నారు. ఈ సమస్యలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సర్కిల్ కమిటీ సభ్యులు కొత్త గణేష్ గౌడ్, ముషం నరహరి, తిరుమల సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## శివసాగర్‌లో యథేచ్ఛ అక్రమ ఇసుక దందా

ఉంటే తరలింది 5000 టన్నులు. జూన్ 30న మధ్యాహ్నం 1:16 గంటలకు ఎలాంటి నోటిఫైడ్ రీచ్ లేని శివసాగర్ ప్రాజెక్ట్ నుండి కొడంగల్ వెంకటేశ్వర స్వామి ఆలయానికి కేవలం 3 క్యూబిక్ మీటర్ల ఇసుక తరలింపునకు ఎమ్మార్వో ఉత్తర్వులు జారీ చేశారు. 3 క్యూబిక్ మీటర్లు అంటే కేవలం 2 ట్రాక్టర్ల లోడ్ మాత్రమే. కానీ ఉత్తర్వులు వెలువడటానికి 6 గంటల ముందు నుండే పదుల సంఖ్యలో టిప్పర్లతో ఇసుక మాఫియా రంగంలోకి దిగిందని స్థానికులు చెబుతున్నారు. అనుమతి 6 టన్నులకే అయినా ఇప్పటివరకు సుమారు 5000 మెట్రిక్ టన్నుల ఇసుక తరలించినట్లు అంచనా. దీని విలువ సుమారు రూ.10 కోట్లు ఉంటుందని సమాచారం. ఎమ్మార్వో తీరుపై యాలాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సి. రవీందర్ రెడ్డి ఎమ్మార్వోను ప్రశ్నించగా ఎమ్మార్వో వెటకారంగా మాట్లాడారని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దేవుడి పేరుతో జరుగుతున్న ఈ అక్రమ ఇసుక రవాణాకు గత నెల డిప్యుటేషన్‌పై వచ్చిన ఎమ్మార్వో కేవలం ఇసుక అక్రమ రవాణా, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ల కోసమే వచ్చినట్లు ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మార్వో వచ్చి రాగానే యాలాల పోలీస్ స్టేషన్‌లో జప్తు చేసిన ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా కాంగ్రెస్ నాయకులకు అప్పగించారని సమాచారం. అంతేకాక టిప్పర్లు తిరిగేందుకు వీలుగా ప్రాజెక్టులోకి పెద్ద మొత్తంలో నాప రాతి వ్యర్థాలు డంప్ చేయడంతో శివసాగర్ ప్రాజెక్టు ఉనికికే ప్రమాదం ఏర్పడిందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాండూరు ఎమ్మెల్యే కనుసన్నల్లో కొందరు బడా కాంగ్రెస్ నాయకుల పర్యవేక్షణలోనే ఈ దందా జరుగుతోందని ప్రజల్లో చర్చ జరుగుతుంది. నాప రాళ్ల డంపింగ్‌తో శివసాగర్‌కు ముప్పు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## భూమి కాజేసిన భూ బకాసురులు

**జిల్లేడు చౌదరిగూడ, జూలై 1 (జనం సాక్షి):**
ఓ నిరుపేద రైతు భూమిని కుదువు పెట్టి అప్పు తీసుకున్నా, దాన్ని కాజేసి మరింత భూమిని కూడా తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకుని మోసం చేసిన ఘటన జిల్లేడు చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మట్టి రమేష్ అనే రైతు తన ఇంటి ముందు ప్లాట్ కొనడానికి డబ్బులు అవసరమై తన పేరు మీద ఉన్న 8 గుంటల భూమిని పోమల మల్లేష్ అనే వ్యక్తికి కుదువు పెట్టి 3 లక్షల 50 వేల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. కానీ మల్లేష్ 8 గుంటల భూమికి బదులు 36 గుంటల భూమి మరియు రమేష్ తల్లి దేవమ్మ పేరు మీద ఉన్న 22 గుంటల భూమిని కూడా తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు.
రమేష్ అప్పు మొత్తం చెల్లించినా భూమి పట్టా ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. ఈ విషయం తెలిసి రమేష్ కుటుంబం చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. మట్టి రమేష్‌కు ముగ్గురు పిల్లలు ఉండటంతో కుటుంబం దిక్కు తోచని పరిస్థితి ఎదుర్కొంటోంది.
రమేష్ భార్య మమత "మా భూమి ఇవ్వండి, లేదంటే పోలీస్ స్టేషన్ ముందే ఆత్మహత్య చేసుకుంటాం" అని హెచ్చరించింది. మానసికంగా కుంగిపోయిన రమేష్ భూమి తిరిగి వస్తుందా అని ఆందోళన చెందుతున్నాడు. ఈ సంఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమాయక రైతులను మోసం చేసి భూములు కాజేస్తున్న మోసగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల నెరవేరుతోంది

- ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ఉండాలి
- అత్తాపురంలో నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం
- పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు

**నవాబుపేట, జూలై 1 (జనం సాక్షి):**
నవాబుపేట మండలం అత్తాపురం గ్రామంలో చాకలి పద్మమ్మ, మానయ్య దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఘనంగా ప్రారంభించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడి వారి కలలను నెరవేరుస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారని, పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ఉండడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అత్తాపురం గ్రామ సర్పంచ్ మేకల సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేదల కలలు నెరవేరుతాయని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలు సొంతింటి సౌకర్యం పొందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అత్తాపురం గ్రామ సర్పంచ్ మేకల సంతోష్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖదీర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏకరూప దుస్తులు ఇప్పట్లో లేనట్లే..!!

**వికారాబాద్ జిల్లా బ్యూరో జులై 1 (జనం సాక్షి):** విద్యార్థుల మనోభావాల్లో తారతమ్యాలు లేకుండా ఉండడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందించడానికి శ్రీకారం చుట్టింది. 2026 - 27 విద్య సంవత్సరానికి 85.157 మంది విద్యార్థులకు రెండు జతలు చొప్పున ఏకరూప దుస్తులు అందజేయడానికి ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్న జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేసే కార్యక్రమం కార్యరూపం దాల్చలేదు. గత ఏడాది విద్యా సంవత్సరంలో జూన్ రెండు నాటికి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థి విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులతో పాటు నోట్ బుక్స్ వర్క్ బుక్స్ పాఠ్యపుస్తకాలను అందజేశారు. కానీ ఈ ఏడాది 15 రోజులు గడిచిన నోట్ బుక్స్ వర్క్ బుక్స పాఠ్యపుస్తకాలు మినహా ఏకరూప దుస్తులు విద్యార్థులకు అందలేదు. గత ఏడాది ఇచ్చిన రెండు జతల బట్టలతో విద్యార్థులు పాఠశాలకు వచ్చి చదువుకుంటున్నారు. వేసవి సెలవుల్లో కొందరి విద్యార్థుల ఏకరూప దుస్తులు చిరిగిపోయిన కారణంగా ఒకే జత ఏకరూప దుస్తులు వేసుకొని పాఠశాలకు వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల కోసం ఏకరూప కలర్ దుస్తులను మార్చివేసింది. ప్రస్తుతం పాలపిట్ట కలర్ అంగి నీలి కలర్ ప్యాంటు బాలికలకు చుడీదార్ పైజామాలు చున్నీ కోటు ఇవ్వాలని నిర్ణయించింది. కానీ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కలరు బట్టను కొనుగోలు చేయలేదు. ప్రతి ఏడాది విద్య సంవత్సరానికి మండల సమాఖ్య మహిళల ద్వారా మార్చ్ ఏప్రిల్ లో బట్ట ఇచ్చి విద్యార్థులకు రెండు జతల బట్టలను కుట్టించి సమయానికి అందించేవారు. ఈ ఏడాది అలా జరగలేదు. కనీసం విద్యార్థుల ఏక రూప దుస్తుల కోసం బట్ట కొనుగోలు చేయలేదు. ఇప్పటికిప్పుడు డ్వాక్రా మహిళలకు బట్ట అందజేస్తే జిల్లాలోని అన్ని పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు తయారుచేసి ఇవ్వడానికి కనీసం రెండు నెలల వ్యవధి పడుతుంది. గత ఏడాది ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులను ప్రభుత్వం అందజేసింది. కానీ ఇప్పుడు ఇంటర్ వరకు చదువుతున్న బాల బాలికలకు ఏకరూప దుస్తులు అందజేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం కేజీబీవీ మాత్మ గాంధీ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు తయారు చేయడానికి మండల సమాఖ్యలకు ప్రభుత్వం బట్ట అందజేసింది. వారికి దుస్తులు తయారు చేయడంలో డ్వాక్రా మహిళలు నిమగ్నమయ్యారు. కానీ మున్సిపాలిటీలో ఉన్న మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ విద్యార్థులకు ఏకరూప దుస్తుల కోసం ప్రభుత్వం బట్టను అందజేయలేదు. దీంతో ఆ ప్రెసిడెంట్షియల్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇప్పట్లో అందే అవకాశం లేదు.




### విద్యార్థులకు యూనిఫాం అందించడంలో జాప్యం.. మండల విద్యాధికారులు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలకు ఏకరూప రెండు జతల దుస్తులు అందించడంలో జాప్యం జరుగుతుందని వివిధ మండలాలకు చెందిన విద్యాధికారులు జనం సాక్షికి తెలియజేశారు. గత ఏడాది జూన్ రెండు నాటికి పుస్తకాలు నోట్ బుక్స్ రెండు జతల ఏకరూప దుస్తులు విద్యార్థులకు అందించినట్లు తెలియజేశారు. ఎందుచేత ఈ ఏడాది ఏకరూప దుస్తుల సరఫరా లో జాప్యం జరుగుతుందో తమకు తెలియదని అన్నారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లాలోని అన్ని మండల విద్యాధికారుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు వివరించారు.

# ప్రభుత్వ కార్యాలయాలలో పలు కీలక పోస్టులు ఖాళీ..

**దుద్యాల/బొంరాస్ పేట, జూలై 1 (జనం సాక్షి):** ప్రభుత్వ కార్యాలయాల్లో పలు కీలక పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలు కార్యాలయాలు చుట్టు ప్రదక్షినలు చేసి రోజుల తరబడి చెప్పులు అరిగేలా తిరిగిన పనులు కావడం లేదని వాపోతున్నారు. నూతనంగా ఏర్పడిన దుద్యాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సూపర్డెంట్ శ్రీనివాసులు , అటెండర్ ఖలీల్ ఇటీవల ఇతర మండలాలకు బదిలీ అయ్యారు.గతంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో బదిలీ కావడంతో కొడంగల్ మండలంలో విధులు నిర్వహిస్తున్న మండల పంచాయతీ అధికారి జైపాల్ రెడ్డిని మండల ఇన్చార్జి ఎంపీడీవోగా నియమించారు. దుద్యాల గ్రామంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శికి ఇన్చార్జి మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు అప్పగించారు. ఈ పంచాయతీ ఆపరేటరు ఒక్కరే విధులు నిర్వహిస్తున్నాడు.మండల అభివృద్ధి కార్యక్రమాలు అమలు పరిపాలన వ్యవహారాలు సంక్షేమ పథకాల నిర్వహణలో కీలకపాత్ర పోషించే కార్యాలయాల్లో సిబ్బంది కొరత వల్ల పనులు కావడంలేదని ప్రజలు బహిరంగంగానే వాపోతున్నారు. మరో వైపు మండలం మహిళా సమైక్య ఏపీఎం ఉమ్మడి మండలానికి ఒక్కరే ఉండడంతో వివిధ పనుల నిమిత్తం వెళ్లాలంటే బొంరాస్ పేట కు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. మరోవైపు ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన కార్యాలయం లేకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. దుద్యల్ మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు ఇటీవల సబ్సిడీ వేరుశనగ విత్తనాల కుంభకోణంలో సస్పెండ్ అయ్యారు.

బొంరాస్ పేట మండల పరిధిలో విద్యుత్ శాఖలో ఏఈ గత కొన్ని రోజుల క్రితం బదిలీ కావడంతో పోస్టు ఖాళీగా ఉంది. రైతులు విద్యుత్ సమస్యలకు సంబంధించి కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగు చెందుతున్నారు.ఉపాధి హామీలో ఏపివో బదిలీ కావడంతో ఇన్చార్జిగా ఈసీ ఇలియాస్ విధులు నిర్వహిస్తున్నారు.మండల పరిషత్ కార్యాలయంలో కీలకంగా మారిన ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్చార్జిగా సూపర్డెంట్ వెంకన్ గౌడ్ విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా సీనియర్ అసిస్టెంట్ గోపాలకృష్ణ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఇంకా ఎవరు రాలేదు. వ్యవసాయ శాఖలో తుంకిమెట్ల క్లస్టర్ ఏఈవో శైలజ బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఎవరు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి కీలకమైన పోస్టులను భర్తీ చేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

### కీలకమైన పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



దుద్యాల, బొంరాస్ పేట మండలాల పరిధిలోని ప్రభుత్వ కార్యాల యాలలో కీలకమైన పోస్టులు భర్తీ కాకపోవడం ,ఇన్చార్జి అధికారులు నామమాత్రంగా విధులకు హాజరు కావడంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగి వెను తిరుగుతున్నారు.ప్రభుత్వం వెంటనే కీలకమైన పోస్టులను భర్తీ చేయాలి.

**-సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య**



## శేరిలింగంపల్లిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**శేరిలింగంపల్లి, జూలై 1 (జనం సాక్షి):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మంచినీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ జలమండలి అధికారులను కోరారు. నియోజకవర్గ కార్యాలయంలో జలమండలి ఈడి సంతోష్ రెడ్డి, జనరల్ మేనేజర్లు కృష్ణ, హరి శంకర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిగణలోకి తీసుకొని సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.వర్షాకాలం ముందు అన్ని శాఖల అధికారులు సన్నద్ధంగా ఉండాలని, మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, మురుగునీరు పొంగకుండా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై నిజాయితీగా స్పందించి, జవాబుదారీతనంతో పని చేయాలని జలమండలి అధికారులకు సూచించారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి డివిజన్‌లో అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అసంపూర్తిగా మిగిలిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో ముందుకు సాగి, అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పని చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జలమండలి డిజిఎంలు శ్రీమన్నారాయణ, శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బుడగ జంగం కుటుంబంపై దాడి

### నిందితులపై చర్యలకు దళిత, మైనార్టీ సంఘాల డిమాండ్



**యాలాల జులై 1 (జనంసాక్షి) :** చేతి వృత్తి చేసుకుంటున్నారన్న కారణంతో బుడగ జంగం నర్సింలు, ఆయన కుటుంబంపై దాడి చేసి కులంపేరుతో దూషిస్తూ హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత, మైనార్టీ, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.దారుర్ మండల కేంద్రానికి చెందిన నర్సింలు సాయంత్రం 7 గంటల సమయంలో తన బర్రెను వెతుక్కునేందుకు వెళ్లారు. ఆ సమయంలో కొందరు వ్యక్తులు నర్సింలు, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేశారు. కులం పేరుతో దూషిస్తూ చంపేందుకు ప్రయత్నించారని బాధితులు ఆరోపిస్తున్నారు. బుధవారం దారూర్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లిన బాధితుల ఫిర్యాదును పోలీసులు తీసుకోలేదని నాయకులు ఆరోపించారు. పైగా ప్రత్యర్థుల ఫిర్యాదు తీసుకుని వారికి అనుకూలంగా వ్యవహరించారని, బాధితులను స్టేషన్‌లోనే నిర్బంధించి భోజనం కూడా పెట్టకుండా ఇబ్బంది పెట్టారని తెలిపారు.ఈ ఘటనపై కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి కే శ్రీనివస్ మాట్లాడుతూ నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, ఐపిసి 307 సెక్షన్ క్రింద హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బుడగ జంగం (ఎస్సీ) అని అవమానపరిచి ఏకపక్షంగా వ్యవహరించిన ఎస్సై పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. చర్యలు తీసుకోకపోతే వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా దళిత, మైనార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని నాయకులు హెచ్చరించారు. పోలీసులు ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాలని, ఉన్నవారికి ఒక న్యాయం లేనివారికి ఒక న్యాయంగా వ్యవహరించడం సరికాదని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు చంద్రయ్య, తాండూర్ ఇన్చార్జ్ సాదిక్, కురుమ సంఘం నాయకులు బాలప్ప, దళిత నాయకులు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వెంటనే ఇవ్వాలి

### సీపీఎం నేతలు,ఆర్డీవో కు వినతి పత్రం



**రాజేంద్రనగర్,జూలై1(జనంసాక్షి) :** ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వెంటనే ఇవ్వాలని రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి కె. నర్సింహా రెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు పుస్తకాల నర్సింగ్‌రావు, టి. రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి స్థలాలు, ఇళ్ల పట్టాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాలను పంపిణీ చేయాలని, పూర్తికాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని రాజేంద్రనగర్ ఆర్డిఓ శ్రీధర్ కు వినతి పత్రం అందజేశారు.ప్రభుత్వం పేదల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్. యాదగిరి, రియాజ్, కె. చందు యాదవ్, నర్రగిరి, ఎన్. మల్లేష్, జె. ఆనంద్ గౌడ్, కె. లక్ష్మి, జె. విజయానంద్ గౌడ్, సుధాకర్, సయ్యద్ ఖాజా, గిలకరాజు, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విబిజి రామ్‌జీ చట్టం అమలు వద్దు

### ఉపాధి హామీనే కొనసాగించాలి..
### వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్.



యాలాల, జూలై 1 ( జనంసాక్షి ) : కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుండి అమలు చేయాలని ప్రకటించిన 'విబిజి రామ్‌జీ చట్టాన్ని' తీవ్రంగా వ్యతిరేకిస్తూ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్నే యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు యాలాల మండల ఎంపిడిఓ కు సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప వినతిపత్రం అందజేశారు. కొత్త చట్టం ద్వారా 125 రోజుల పని కల్పిస్తామని ప్రచారం చేస్తున్నా, గతంలో 90శాతం నిధులు ఇచ్చిన కేంద్రం ఇప్పుడు కేవలం 40శాతం మాత్రమే ఇస్తుందని, మిగిలిన 60శాతం రాష్ట్ర ప్రభుత్వాలపై భారం వేస్తున్నారని సంఘం ఆరోపించింది. వ్యవసాయ సీజన్‌లో 60 రోజులు పని బంద్ చేయాలని కొత్త చట్టంలో ఉందని, దీనివల్ల కూలీలు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు.ఉదయం, సాయంత్రం పని ప్రదేశంలో ఫోటోలు అప్‌లోడ్ చేస్తేనే వేతనాలు చెల్లిస్తామనే నిబంధన కూలీలను ఇబ్బంది పెడుతుందని విమర్శించారు. ఎవరికి, ఎప్పుడు, ఎక్కడ పని కల్పించాలో గ్రామ పంచాయతీ నిర్ణయించే అవకాశం లేకుండా కేంద్రమే అన్నీ నిర్ణయిస్తుందని తెలిపారు.కొత్త చట్టం అమలైతే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూలీల హక్కులను హరించే 'విబిజి రామ్‌జీ చట్టాన్ని' మండలంలో అమలు చేయవద్దు.కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలి.విద్యుత్ సంస్కరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి.దేశవ్యాప్త పోరాటంతో సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్పతో పాటు కిష్టయ్య, అనంతయ్య, రాజ్‌కుమార్ తదితరులు సంతకాలు చేశారు. ఈ కొత్త చట్టం వల్ల వ్యవసాయ కూలీల జీవనోపాధికి విఘాతం కలుగుతుందని, కాబట్టి దీన్ని తక్షణమే నిలిపివేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## ఉర్దూ మీడియం స్కూల్ ప్రహరీ గోడకు భూమిపూజ



**యాలాల, 2026 జూలై 1(జనంసాక్షి) :** యాలాల మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ సిహెచ్. శివయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్కిరెడ్డి శోభారాజు రెడ్డి, వార్డు సభ్యులు మ్యాదరి అశ్విని, శేఖర్, ఉమేష్ పాల్గొన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోల్ నాగయ్య, కార్యదర్శి హైమద్‌తో పాటు బుర్ణపూరి నర్సిములు, హన్మంతు, బషీర్, మ్యాదరి వేణు, మలిగేరి శివకుమార్, వెంకటేశం, బి. హన్మంతు, అశోక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివయ్య మాట్లాడుతూ, విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మాణం అవసరమని, పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ పూర్తి సహకారం అందిస్తుందని ఉపసర్పంచ్ శోభారాజు రెడ్డి పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

### బంట్వారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా పురుషోత్తం

బంట్వారం (జనం సాక్షి) : బంట్వారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బక్కా పురుషోత్తం రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షుడు, యంఎల్‌సి మహేశ్ కుమార్ గౌడ్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో మండల అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని ఆయనకు సూచించారు. ఈ నియామకంపై స్పందించిన పార్టీ నాయకులుపురుషోత్తం రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

జనంసాక్షి

# నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది

**కొమ్మనబోయిన సైదులు యాదవ్**



సికింద్రాబాద్(జనంసాక్షి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ను చేపట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ , ఓయూఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థి, నిరుద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కొమ్మనబోయిన సైదులు యాదవ్ మాట్లాడుతూ... అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఆశ చూపి, నేడు నోటిఫికేషన్ల విడుదలలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీసు ఉద్యోగాలకు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పరిధిలోని ప్రాంతాల్లో ప్రత్యేక డీఎస్సీని నిర్వహించడంతో పాటు, యూపీఎస్సీ తరహాలోనే ఏటా పక్కాగా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలన్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని, అన్ని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైన టీజీపీఎస్సీ చైర్మన్ తక్షణమే రాజీనామా చేయాలని, అలాగే 2023లో కాంట్రాక్టు జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే ఓయూ పరిధిలోని అన్ని విద్యార్థి సంఘాలను ఏకం చేసి, భవిష్యత్ ఉద్యమ ఐక్య కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి, బీఆర్ఎస్వీ నాయకుడు పవన్, జేవీఎస్ సంఘం అధ్యక్షుడు చీరల వంశీ, విద్యార్థి నాయకులు ప్రభాకర్, సాయి కిరణ్, అరుణ్, మహేష్ యాదవ్, చిందం మధు, కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్‌లో బిఎల్‌ఓలతో శ్రీశైల్ రెడ్డి సమీక్షా సమావేశం

- సర్‌పై అప్రమత్తంగా పనిచేయాలి
- బోగస్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన
- బిఎల్తోఓల సమన్వయమే విజయానికి కీలకమని దిశానిర్దేశం



**తాండూరు, జూలై 1 (జనంసాక్షి) :** ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమంలో తలెత్తుతున్న పలు అంశాలపై తాండూర్ క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ తాండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీశైల్ రెడ్డి పంజుగుల ఆధ్వర్యంలో బిఎల్ ఓల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి క్లస్టర్ ఇన్‌చార్జులు, బిఎల్ ఎలు, పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు.సమావేశంలో శ్రీశైల్ రెడ్డి పంజుగుల మాట్లాడుతూ సర్ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా తీసుకోవాలని బిఎల్ ఓ లకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బోగస్ ఓట్లు, డూప్లికేట్ నమోదులు లేదా అర్హత లేని నమోదులపై పూర్తి ఆధారాలతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదేవిధంగా, ప్రతి గ్రామం, వార్డులో బిఎల్‌ఓలతో సమన్వయంతో పనిచేయాలని, సమస్యలు ఎదురైనప్పుడు ఘర్షణలకు దూరంగా ఉండి అధికారిక విధానంలో పరిష్కారం కోరాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా పని చేయడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.

సర్ కార్యక్రమంలో ప్రతి బిఎల్ ఎలు చురుకైన పాత్ర పోషించాలని, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని శ్రీశైల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా, ఖచ్చితత్వంతో ఉండేలా పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా నాయకులు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పలు సమస్యలను శ్రీశైల్ రెడ్డి దృష్టికి తీసుకురాగా.. ఆర్డీవో, ఎమ్మార్వోలతో మాట్లాడి పరిష్కరించు కుందామని, పార్టీ శ్రేణులు కూడా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యల నివృత్తికి కృషిచేయాలని, పార్టీ నాయకత్వం సర్వదా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దీపా నర్సిములు, శోభారాణి, ఇర్ఫాన్, నర్సిరెడ్డి, కోహీర్ శ్రీనివాస్, రాజప్ప గౌడ్, వెంకట్ రెడ్డి, కృష్ణ, కౌన్సిలర్లు సంతోష్, జావేద్, సురేష్, అనిల్, నాయకులు సలీమ్, రాకేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నవాబుపేట్ జిల్లా ఉన్నత పాఠశాలలో స్వచ్ఛభారత్

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం**



**నవాబుపేట్ జులై 1.( జనం సాక్షి) :**

నవాబుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెకె ఎం ఆర్ ఫౌండేషన్ చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ"ట్రాక్ కార్యక్రమాన్ని విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి. ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో, జెకె ఎమ్ ఆర్ ఫౌండేషన్,ద్వారా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు బాత్రూమ్‌లను ప్రతిరోజూ శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టడం అభినందనీయం. ఈకార్యక్రమంలో భాగంగా, నవాబ్‌పేట మండలానికి కేటాయించిన "స్వచ్ఛ ట్రక్"ను మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం ప్రారంభించారుఈకార్యక్రమంలో నవాబ్‌పేట స్థానిక సర్పంచ్ గాజుల గూడెం నర్సింహా రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు చంద్రకాంత్, మండల బిజెపి సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి,మాజీ సర్పంచ్‌లు జైపాల్ రెడ్డి, రత్నం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం, మండల ఎంఈఓ అబ్దుల్ రెహ్మాన్, రాష్ట్ర ఐటీ సెల్ జాయింట్ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, వికారాబాద్ జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు గాలయ్య, మండల నాయకులు భీం రెడ్డి, మహేందర్ రెడ్డి, నర్సిములు, చక్రంపల్లి లక్ష్మణ్, సయ్యద్ గౌస్, వడ్ల శ్రీకాంత్ చారి, యువ మోర్చా నాయకులు శ్రీధర్ రెడ్డి, మహేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.ఈ స్వచ్ఛ ట్రక్ ద్వారా జెకెఎమ్ఆర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాములు నవాబ్‌పేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల బాత్రూమ్‌లను ప్రతిరోజూ శుభ్రపరచడం ద్వారా విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించనున్నారు.పరిశుభ్రమైన పాఠశాల... ఆరోగ్యవంతమైన విద్యార్థులకు అన్ని ఏర్పాటు చేసే విధంగా కృచి చేస్తాను అన్నారు.

## సర్ ప్రక్రియను గ్రామ ప్రజలు విజయ వంతం చేయండి

**కొడంగల్ జూలై 01( జనం సాక్షి):** కొడంగల్ మండలం అంగడి రాయిచూర్ అనుబంధ గ్రామ ధర్మపూర్ గ్రామంలో ఎన్యుమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయ రాములు మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా మార్పులు ఉంటే సరిచేసుకుని బిఎల్‌ఓలకు తప్పులు లేకుండా పూరించి ఇవ్వాలని గ్రామ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బిఎల్ ఓ సుశీలమ్మ,గ్రామ ప్రజలు పకిరప్ప,రాజు, నర్సింములు, కశప్ప.నర్సప్ప.కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

## జూలై 12న 'భరతోదయము' మహాకావ్య గ్రంథావిష్కరణ



**సికింద్రాబాద్, జనం సాక్షి:** ప్రముఖ కవి, రచయిత ఆచార్య డాక్టర్ దేవరాజు రాంభావు రచించిన 'భరతోద యము' మహాకావ్య గ్రంథావిష్కరణ కార్యక్రమం జూలై 12న హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో ఉన్న శ్రీ సత్యసాయి నిగమాగమం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు నవ్య సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర తెలిపారు. నవ్య సాహితీ సమితి అమృతోత్సవాల సందర్భంగా ఈ ప్రత్యేక సాహిత్య మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 'భరతోదయము' మహాకావ్యంతో పాటు పద్య, గేయ, వచన కవితా సంపుటులు సహా పలు సాహిత్య కృతులను ప్రముఖ సాహితీవేత్తలు, కవులు, రచయితల సమక్షంలో ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. పండితులు దేవరాజు కృష్ణయ్య ఆశీస్సులతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. మహాకవి వానమామలై వరదాచార్య సాహిత్య సేవలకు సూచకంగా 'భరతోదయము' మహాకావ్యాన్ని ఆయనకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. భారతీయ సంస్కృతి, మానవతా విలువలను ప్రతిబింబించే ఈ మహాకావ్యం తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో నవ్య సాహితీ సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు వేమరాజు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కొనసాగించాలి



**నిజాంపేట్ జూలై1(జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం విబిజి ఆర్ఏ ఎంజి చట్టాన్ని ఉపసంహ రించుకొని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కొనసాగించాలని కోరుతూ బుధవారం సీఐటీయూ బాచుపల్లి మండలం కమిటీ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ రాథోడ్ అధ్యక్షతన ఎస్సార్ ప్రగతి నగర్ ఏనుగుల బొమ్మ చౌరస్తా దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర అశోక్ మాట్లాడుతూ ఎంజిఎస్ఆర్ఆజివి స్థానంలో విబి జి.రామ్ జి పథకాన్ని ప్రతిపాదించడాన్ని వ్యతిరేకిస్తూ, గ్రామీణ కుటుంబాల పని హక్కును పరిరక్షిస్తూ గ్రామీణ కార్మికులు, పేద రైతులు, మహిళలు, దళితులు, ఆదివాసులు, ఇతర బలహీనవర్గాలకు ఉపాధి భద్రత, ఆదాయ మద్దతును అందించే అత్యంత ముఖ్యమైన శాసనపరమైన చర్యలలో ఎంజిఎస్ఆర్ఎజివి ఒకటి. ఈ ఉపాధి హామీ వ్యవస్థను బలహీనపరిచే, నీరుగార్చే లేదా రద్దు చేసే ఏ ప్రయత్నమైనా, లక్షలాది గ్రామీణ కుటుంబాల జీవనోపాధిపైనా, మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైన తీవ్ర పరిణామాలను కలిగిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా సిఐటియు బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్ మాట్లాడుతూమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రతిఘటించడానికి, గ్రామీణ భారతదేశ హక్కులను, జీవనోపాధులను కాపాడుకోవడానికి రైతులు, వ్యవసాయ కార్మికుల ఐక్యత అత్యంత అవసరం అని తెలిపారు. ఎంజిఎస్ఆర్ఆజిఎను బలోపేతం చేయాలని, , ఉపాధి హామీ వ్యవస్థను బలహీనపరిచే ఎలాంటి చర్యలనైనా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బాచుపల్లి మండల నాయకులు బీసీ డబ్ల్యూ మండల ఇన్చార్జి పి.భాస్కర్, అంజయ్య, మనీ, నాగ శేషు, తిరుపతి రెడ్డి, తిరుపతి స్వామి, మల్లికార్జున్, శీను, బొట్టు శీను, చిట్టెమ్మ, నరసమ్మ, అంజమ్మ, మచ్చమ్మ, శైలజ, శివ, నాగయ్య, మన్నెమ్మ, లక్ష్మి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## వీబీజీరాంజీ చట్టాన్ని రద్దుచేసి ఎంజిఎన్ఆర్ఈజీఎస్ చట్టాన్ని అమలు చేయాలి

**సిఐటియు వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య**

**దుద్యాల, జూలై 1 (జనం సాక్షి):** సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం దుద్యాల మండల కేంద్రంలో విబిజిరాంజీ చట్టాన్ని రద్దు చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య మాట్లాడుతూ విబిజీరాంజీ చట్టాన్ని రద్దుచేసి ఎంజిఎన్ఆర్ఈజీఎస్ చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్షాల పోరాట ఫలితంగా సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం తగదన్నారు.నూతన చట్టం తెచ్చి 150 రోజుల పని ప్రచారం చేస్తున్నారు కానీ నిధుల కేటాయింపు బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుందని వాపోయారు. కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్ లు, విద్యుత్తు సంస్కరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాములు, పాండు, ఎల్లమ్మ, యాదమ్మ, రాములమ్మ, అనంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య
- లక్ష మందితో సచివాలయం ముట్టడే తదుపరి కార్యాచరణ
- చిక్కడపల్లి లైబ్రరీ నిరుద్యోగ జేఏసీ నాయకుల హెచ్చరిక



**ముషీరాబాద్, జూన్ 01 (జనం సాక్షి):** నిరుద్యోగ సమస్య పరిష్కరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య కోరారు. ఈమేరకు బుధవారం సాయంత్రం హైదరాబాద్, చిక్కడపల్లి లోని సిటీ సెంట్రల్ లైబ్రరీ లో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ కొత్త జిల్లాలు, కొత్త మండలాలు, అదనపు ఆఫీసులో ఏర్పడిన తర్వాత అదనపు పోస్టులు సృష్టించడం, భర్తీ చేయడం లేదన్నారు. అలాగే ప్రమోషన్ల ద్వారా రిటర్మెంట్ వల్ల ఏర్పడ్డ పోస్ట్ లు భర్తీ చేయలేదన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో దాదాపు 18 వేల కానిస్టేబుల్ ఎస్సైలు తదితర పోస్టులు ఖాళీగా ఉన్న నోటిఫికేషన్ జారీ చేయడం లేదన్నారు. అదేవిధంగా విద్యా శాఖ లోని ప్రభుత్వ పాఠశాలలో బీసీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీ గురుకుల, ఆదర్శ కస్తూర్బా, ఎయిడెడ్ పాఠశాలలో కలిపి 30 వేల పోస్టులు భర్తీ చేయవలసి ఉందన్నారు. దీంతో టీచర్ పోస్టులు భర్తీ చేయకపో వడంతో పాఠశాలలో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయనీ అన్నా రు. ఇక 14 యూనివర్సిటీలలో టీచర్ పోస్టులు 2800 ఖాళీగా, ప్రొఫెసర్ పోస్టులు లెక్చరర్ పోస్టులు 80 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అన్ని యూనివర్సిటీలో టీచింగ్ పోస్టులు లేక విలవిల పోతున్నారన్నారు, విద్య ప్రమాణాలు, రీసెర్చ్ లేక యూనివర్సిటీలో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయన్నారు. వెంటనే ఈ పోస్టులను భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా గ్రూప్ 1 గ్రూప్ 2 గ్రూప్ 3 కింద ఉన్న 20 వేల పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని తెలిపారు.

చిక్కడపల్లి లైబ్రరీ నిరుద్యోగ జేఏసీ నాయకులు శంకర్ నాయక్, నరేష్, రవి నాయక్, రవి యాదవ్, కుమార్, పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు - నిధులు నియామకాలనే ఆశలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. అయితే గత పదేళ్ల పాలనలో పలు నియామక పరీక్షల్లో పేపర్ లీకేజీలు జరగడం, ఉద్యోగాల భర్తీ ప్రక్రియలు ఆలస్యం కావడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. 2023 శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఒకే ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని అలాగే యూత్ డిక్లరేషన్ ద్వారా యువతకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. ఆ హామీలను విశ్వసించిన తెలంగాణ యువత ముఖ్యంగా నిరుద్యోగులు బస్సుయాత్ర నిర్వహించి కాంగ్రెస్ పార్టీని అధికారులకు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఉద్యో గ నోటిఫికేషన్ల సాధన కోసం తాము ఎన్నో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్న సమయంలో ఉద్యోగ నోటిఫికేషన్ వద్దని నిరుద్యోగులు ధర్నాలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం తమను తీవ్ర వేదనను కలిగించిందన్నారు. నిజాలను వక్రీకరించడం కాకుండా చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ, అశోక్ నగర్ , దిల్ సుక్ నగర్ ప్రాంతాలకు వచ్చి నిరుద్యో యువతను ప్రత్యక్షంగా కలిసి వారి అభిప్రాయలనుతెలుసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా నిరు ద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారాలను పక్కనపెట్టి నిరుద్యోగ యువత ఆత్మ బలిదానాలకు ముగింపు పలికేలా వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగం నోటిఫికేషన్ విడుదల చేయకపోతే లక్ష మందితో సచివా లయం ముట్టడే తమ తదుపరి కార్యాచరణ కార్యక్రమం ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకు లు, దామోదర్ రెడ్డి, సవాయిసింగ్, మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, ఉష, దివ్య, కల్పన, వెంకట్,పోటీ పరీక్షలు అభ్యర్థులు పాల్గొన్నారు.

# నేడే కల్వకుర్తిలో కాంగ్రెస్ విజయోత్సవ సభ

- కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు
- ఆమనగల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు



**ఆమనగల్ జూలై 01(జనంసాక్షి):** నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి ఆధ్వర్యంలో చేపట్టిన రెండు బస్సు యాత్రల ముగింపు సందర్భంగా కల్వకుర్తి పట్టణంలో ఈనెల 2,న గురువారం జరిగే కాంగ్రెస్ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఆమనగలు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు కోరారు. ఆమనగల్ పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుర్రం కేశవులు మాట్లాడుతూ..గత నెల 2,న రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల విజయాలను ప్రజలకు వివరించేందుకు ఎంపీ మల్లురవి ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా ఆలంపూర్ లోని జోగులాంబ దేవాలయం నుంచి బస్సు యాత్ర ప్రారంభించడం జరిగిందని చెప్పారు.అలాగే మహనీయుల చరిత్రను ప్రజలకు వివరించేందుకు మరో బస్సు యాత్ర గత నెల 2,న మైసిగండిలో ప్రారంభించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.రెండు బస్సు యాత్రల ముగింపు సందర్భంగా కల్వకుర్తి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,ల ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.బహిరంగ సభకు రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ,జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని ఆయన చెప్పారు.బహిరంగ సభకు కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,బహుజన నాయకులు,పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

## ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని పరిశీలించిన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్



**ఖైరతాబాద్, జూలై 01 (జనం సాక్షి) :** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని సింగ డికుంట ప్రాంతంలోని పోలింగ్ స్టేషన్ నెం.216 వద్ద కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బుధవా రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్(డీఎంసీ) శంకర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్(ఏఎంసీ) కైలాష్‌తో కలిసి ఫారాల పంపిణీ తీరును సమీక్షిం చారు. ఇంటింటికీ ఫారాల పంపిణీ, ఓటరు నమో దు ప్రక్రియ, ప్రజలకు కల్పిస్తున్న అవగాహన కార్య క్రమాలపై అధికారులతో చర్చించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం చేరేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు. కా ర్యక్రమం పారదర్శకంగా, ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. అ లాగే ఫీల్డ్ సిబ్బంది ప్రజలకు అవసరమైన సమాచా రాన్ని స్పష్టంగా అందిస్తూ, నిర్ణీత గడువులోగా ఫారాల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని తెలి పారు. ఈ తనిఖీలో సంబంధిత ఎన్నికల అధికా రులు, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారు లు(బీఎల్‌వోలు), ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.



## విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు ఏర్పాటు

**నేదునూర్ మోడల్ పాఠశాల నుంచి మక్త మాదారంకు ఆర్టీసీ బస్సు ప్రారంభం**

**కడ్తాల్ జూలై 01(జనంసాక్షి):** కడ్తాల్ మండలం మక్త మాదారం గ్రామం నుంచి నేదునూర్ మోడల్ స్కూల్ తో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,కళాశాలకు చదువుల కోసం విద్యార్థులు నిత్యం వెళ్తుంటారు.విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ నేపథ్యంలో మహేశ్వరం డిపో అధికారులు స్పందించి విద్యార్థుల సౌకర్యం కోసం బుధవారం ఆర్టిసి బస్సులు ఏర్పాటు చేశారు.మక్త మదారం గ్రామంలో ఆర్టీసీ బస్సు ప్రత్యేక పూజలు నిర్వహించి డిపో అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.ప్రతిరోజు గ్రామం నుండి ఉదయం 7:30 నిమిషాలకు నేదునూర్ పాఠశాలకు బయలుదేరుతుంది.నేదునూరు పాఠశాల నుండి సాయంత్రం 4:30 నిమిషాలకు బయలుదేరి మక్త మదారం వరకు బస్సు వస్తుంది.విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు.బస్సు సౌకర్యం కల్పించిన హయత్ నగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కవిత,మహేశ్వరం డిపో మేనేజర్ లక్ష్మీ సుధా,డిపో సిఐ అంజమ్మకు,డిపో సిబ్బందికి గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రామకృష్ణ,అంజయ్య,మల్లేష్ యాదవ్,చంద్రయ్య,ఆర్టీసీ డ్రైవర్ హైమద్,కండక్టర్ రాము,విద్యార్థులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై రేప్ ఘటనలో ఉన్మాదికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**శేరిలింగంపల్లి, జూలై 01 (జనంసాక్షి) :** ఓ మైనర్ బాలికపై కన్నేసి ఉద్దేశపూర్వకంగా ఆమెను లోబరుచుకుని పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన ఓ ఉన్మాదికి రాష్ట్ర హైకోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు బాలికకు లక్ష రూపాయల భృతి ఇచ్చేలా బుధవారం సంచలన తీర్పునిచ్చింది. ఈ మేరకు సైబరాబాద్ క్రైమ్స్ విభాగం డిసిపి ముత్యం రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్ర ప్రాంతానికి చెందిన మహమ్మద్ అఫ్రోజ్(23) బ్రతుకుతెరువు పేరుతో నగరానికి వచ్చి లింగంపల్లిలో నివాసం ఉంటూ ఇంటి పక్కన ఉన్న మైనర్ బాలికపై కన్నేశాడు. ఎలాగైనా ఆమెను లోపర్చుకొని అత్యాచారం చేయాలన్న కుట్రతో సదరు బాలికకు మాయమాటలు చెప్పి 2020 సంవత్సరం మార్చి 15వ తేదీన ఇంట్లో నుండి లేపుకెళ్లిపోయి పెళ్లి చేసుకుంటానని చెప్పి పలుమాలు ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ క్రమంలో సదరు బాలిక తల్లి తమ కూతురు ప్రైవేట్ ఉద్యోగానికి వెళుతున్నానని చెప్పి కనిపించకుండా పోయిందని అదే సంవత్సరం మార్చి 16వ తేదీన చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మహిళ ఇచ్చిన ఆధారాలమేరకు దర్యాప్తును కొనసాగించిన చందానగర్ పోలీసు అధికారులు అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైన బాలిక అఫ్రోచ్ దగ్గరే ఉందని, అప్పటికే ఆమెపై పలుమార్లు లైంగిక దాడి జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇందులో భాగంగా 10 జులై, 2020 వ తేదీన అఫ్రోజ్ ను అదుపులోకి తీసుకొని తగిన సాక్షదారులతో కోర్టుకు పంపగా దాదాపు ఆరు సంవత్సరాల తర్వాత శిక్షణ ఖరారు చేస్తూ జడ్జి తీర్పును ఇవ్వడం జరిగింది. 20 ఏళ్లు కట్టిన కారాకార శిక్ష, 3 వేల రూపాయల పెనాల్టీతోపాటు బాలికకు నష్టపరిహారంగా లక్ష రూపాయలు చెల్లించేలా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును వెల్లడించింది. దీంతో నిందితుడు అఫ్రోజ్ ను సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించడం జరిగింది.

## శరత్ సిటీ క్యాపిటల్ మాల్ వద్ద ట్రాఫిక్ మెరుగుదల కోసం కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**శేరిలింగంపల్లి, జూలై 01 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి శరత్ సిటీ క్యాపిటల్ మాల్ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు అనువైన చర్యలు చేపట్టే క్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిని సృజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ బుధవారం ఆ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా వారి వెంట కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసు, టౌన్ ప్లానింగ్ మరియు ఇంజినీరింగ్ విభాగాల సీనియర్ అధికారులంతా హాజరు కావడం జరిగింది. శరత్ సిటీ క్యాపిటల్ మాల్ పరిసర ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని సమీక్షించి, వాహనాలు మరియు పాదచారుల రాకపోకలను మెరుగుపరిచే చర్యలపై వారు చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రవేశ, నిష్క్రమణ మార్గాల మెరుగుదల, రహదారి విస్తరణద్వారా ట్రాఫిక్ బాటిల్‌నెక్‌ల తొలగింపు, అండర్‌పాస్ నిర్మాణ సాధ్యాసాధ్యాల పరిశీలన, పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు, ట్రాఫిక్ నిర్వహణ మరియు పార్కింగ్ అమలు బలోపేతం, ఆమోదిత ప్రణాళికల ప్రకారం పార్కింగ్ మరియు యాక్సెస్ ఏర్పాట్లపై ఆయా విభాగాల అధికారులతో ఇద్దరు కమిషనర్లు సృజన మరియు డాక్టర్ ఎం రమేష్ అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచేందుకు, పాదచారుల భద్రతను పెంపొందించేందుకు మరియు ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేందుకు సంబంధిత శాఖలు సంయుక్త కార్యాచరణతోకూడిన ప్రణాళికను రూపొందించి అవలు పరచడం ద్వారా మెరుగైన ఫలితాలను రాబట్టడానికి కృషి చేయాలని సూచించడం జరిగిందని వారు తెలిపారు.

# లయన్స్ జిల్లా 324 హెచ్ చార్టర్ డే సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**కాప్రా, జూలై 1 (జనం సాక్షి) :** లయన్స్ జిల్లా 324 హెచ్ చార్టర్ డే వేడుకల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ ఆధ్వర్యంలో బుధవారం సౌత్ కమలనగర్ ప్రభుత్వ ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ హాస్పిటల్ చైర్మన్ లయన్ కొత్త రామారావు, జిల్లా కార్యదర్శి (గ్లోబల్ కాజెస్) లయన్ కొత్తపల్లి రాంబాబు, క్లబ్ అధ్యక్షుడు లయన్ తారకేశ్వరరావు హాజరై విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోటే దేశ అభివృద్ధి, సమాజ అభివృద్ధి సాధ్యమని ,విద్యార్థులకు నోటుబుక్కులు అందజేయడం మంచి మంచి కార్యక్రమం అన్నారు. సమాజ సేవే లక్ష్యంగా లయన్స్ సంస్థ ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన వైఆర్‌పీ ఫౌండేషన్ చైర్మన్ రవి ప్రసాద్ , అలాగే కార్యక్రమానికి సహకారం అందించిన తక్షణ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ గంప నాగేశ్వరరావు నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ చి. వెంకట రామరాజు, కోశాధికారి లయన్ మోహన్, సీనియర్ సభ్యులు లయన్ చంద్రశేఖర్, లయన్ రవిశంకర్ రాజు, లయన్ పెద్ది శ్రీనివాస్, లయన్ అంజనీ కుమార్, లయన్ శ్రావణ్, లయన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను ప్రభుత్వ బడికే పంపించాలి

### గ్రామ సర్పంచ్ కోలి వెంకటేశ్వర్



**ధారూర్ జూలై 01(జనంసాక్షి) :** పిల్లలను ప్రభుత్వ బడికే పంపించాలని ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ పాఠశాలలో వసతులతో పాటు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు.మండల పరిధిలోని నాగసముందర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కొలి వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే ఇటువంటి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.ప్రధానోపాధ్యాయులు పాండురంగ రెడ్డి.మాట్లాడుతూ.విద్యార్థులకు మంచి విద్యతో పాటు విలువలను అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు పాఠశాల కృషి చేస్తుందని తెలిపారు.అలాగే విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఈ రోజు నుంచి పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను ప్రారంభించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మాదరి సంగీత యాదప్ప. ఉపాధ్యాయులు అశోక్. యాదమ్మ. అరుణ. శాంతమ్మ. సరిత. అంగన్వాడి టీచర్లు భాగ్యలక్ష్మి.చంద్రకళ.జగదీశ్వరి.విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 16 నుంచి తెలంగాణ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



**మల్కాజిగిరి జూలై 1 (జనం సాక్షి) :** యోనెక్స్-సన్‌రైజ్ 12వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అండర్-15 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2026 ఈ నెల 16 నుంచి 19 వరకు మణికొండలోని మ్యాచ్ పాయింట్ ఫ్రైడ్ అకాడమీలో జరగనున్నట్లు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్, రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఈ నెల 13లోగా తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలని సూచించారు.రాష్ట్రంలోని ప్రతిభావంతులైన అండర్-15 షట్లర్లకు ఈ చాంపియన్‌షిప్ మంచి వేదికగా నిలుస్తుందని తెలిపారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు రాష్ట్ర స్థాయిలో తమ సత్తా చాటుకునే అవకాశం లభిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. బాలబాలికల్లో బ్యాడ్మింటన్ పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు ఇటువంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ చాంపియన్‌షిప్ ద్వారా భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో రాణించే ప్రతిభావంతులైన షట్లర్లను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యమని వెల్లడించారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సామ ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చిప్ప ప్రభాకర్, కార్యదర్శి పోకూరి ఆనంద్‌బాబు,కోచ్‌తో పాటు మ్యాచ్ పాయింట్ అకాడమీ అధినేత ఎం. వేణు, సమన్వయ కమిటీ సభ్యులు పి. సాయిరెడ్డి, డి. రఘురాం, ఎం. శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

# సేవాలాల్ మహారాజ్ ఆలయానికి రూ.5 లక్షల విరాళం.

### బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్.

తాండూరు జులై 1(జనంసాక్షి)హైదరాబాద్ లోనిఎర్రగుంట తండా, ఇందిరమ్మ కాలనీ, కిస్మత్‌పూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సేవాలాల్ మహారాజ్ ఆలయానికి తాండూర్ బాలాజీ నర్సింగ్ హోం అధినేత, బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ రూ.5 లక్షల విరాళం అందజేశారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు థౌర్య నాయక్, గోపి నాయక్, దేశ్య నాయక్, విక్య నాయక్, రమేష్ నాయక్, హీరలాల్ నాయక్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.విరాళం అందించిన డాక్టర్ సంపత్ కుమార్‌కు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి ఆయన అందించిన సహకారం ఎంతో విలువైనదని, భక్తులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.స్థానికంగా బంజారా సమాజానికి సేవాలాల్ మహారాజ్ ఆరాధ్య దైవం కావడంతో ఈ నూతన ఆలయ నిర్మాణం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నైట్ హాల్ట్ బస్సులు పునః ప్రారంభం చేయండి

**యాచారం, జులై 1(జనం సాక్షి ):** ఇబ్రహింపట్నం డిపో ఆర్టీసీ అధికారులు ఇష్టం వచ్చినట్లు బస్సులు నడుపుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలను రైతులను మహిళలను ఉపాధి కూలీలను విద్యార్థుల ను నానా ఇబ్బందులూ పడుతున్నారు అని ౯=+ ఫౌండేషన్ అధ్యక్షులు రవీందర్ గుప్త అన్నారు. యాచారం మండలం లోని తాటిపర్తి , కుర్మిద, మేడిపల్లి, ముద్విన్, కొత్తపల్లి, మొండి గౌరెల్లి, అజిలాపురం నైట్ హాల్ట్ బస్సులు పునః ప్రారంభం చేయాలని పలు మార్లు ఇబ్రహింపట్నం డిపో మేనేజర్ కు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా వాణి లో ఒక సారి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు, రెండు సార్లు ఇబ్రహింపట్నం లో ప్రజావాణి లో ఆర్టీసీ బస్సులు పునః ప్రారంభం చేయాలని వినతి పత్రాలు ఇచ్చిన స్పందన లేదు. ఇబ్రహింపట్నం డిపో నుంచి తాటిపర్తి ఉమెన్స్ కాలేజీ పోవు బస్సులు ఇబ్రహింపట్నం వరకు నడుపుతున్నారు ఈ బస్సులు ఇబ్రహీంపట్నం నడపడం తో డబ్బులు తక్కువగా వస్తున్నాయి అని పాఠశాలకు సెలవుల పేరుతో గ్రామీణ ప్రాంతాలకు వచ్చే బస్సులు బంద్ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ పోవు వెళ్లిన యధావిధిగా నడపాలని కోరుతున్నాము. ఇబ్రహింపట్నం డిపో మేనేజర్ ఇప్పటికైనా స్పందించి బస్సులు యధావిధిగా నడపాలని PRG ఫౌండేషన్ అధ్యక్షులు రవీందర్ గుప్త డిమాండ్ చేస్తున్నారు. లేనిచో విద్యార్థులు మహిళలు రైతులతో కలిసి ఆందోళన తప్పదు అని అన్నారు.

# ప్రతి ఓటరు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**రాజేంద్రనగర్,జూలై2(జనంసాక్షి) :** మణికొండ నెక్నాంపూర్ డివిజన్‌లో ప్రతి ఓటరు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ కే. రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. .బుధవారం మణికొండ నెక్నాంపూర్ డివిజన్‌లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు దరఖాస్తు ఫారాలు పంపిణీ చేస్తూ, పేరు నమోదు, సవరణలు, చిరునామా మార్పు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శ్రీరామనగర్ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో కే. రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకుడు కంకణాల శివరాంరెడ్డి, బీఎల్వో సందీప్ కుమార్ పాల్గొని బీఎల్వోల సేవలను అభినందించారు. ప్రజలందరూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని వారు కోరారు.

# తాండూరులో డాక్టర్స్ డే వేడుకలు



### వైద్యులను ఘనంగా సన్మానించిన బుయ్యని దంపతులు



**తాండూరు జులై 1(జనంసాక్షి) :** ప్రపంచ డాక్టర్స్ డే సందర్భంగా తాండూరు నియోజకవర్గంలో వైద్యుల సేవలను కొనియాడుతూ ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్బిఓఎల్ సీఈఓ ప్రముఖ సామాజిక సేవకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి (బిఎస్ ఆర్), ఆయన సతీమణి బుయ్యని సరళా రెడ్డి నియోజకవర్గంలోని వైద్యులను శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా బుయ్యని దంపతులు మాట్లాడుతూ వైద్యో నారాయణో హరిః అనే నానుడికి వైద్యులు నిదర్శనం. ప్రజలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ, ప్రాణాలను కాపాడే దైవస్వరూపులు వైద్యులు అని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రతి వైద్యుడికి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. వైద్యుల సేవా స్ఫూర్తి మరెందరికో ఆదర్శంగా నిలిచి, సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతకు పాఠశాలలు నిబంధనలు పాటించాలి



**రాజేంద్రనగర్,జూలై2(జనంసాక్షి) :** పాఠశాల విద్యార్థుల భద్రత విషయంలో యాజమాన్యాలు అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని రాజేంద్రనగర్ డీసీపీ ట్రాఫిక్ రాహుల్ హెగ్డే సూచించారు. ఆయన ఆదేశాల మేరకు బుధవారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సి.హెచ్. రాజు ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల బస్సుల డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు, బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తదితర పత్రాలను పరిశీలించారు. అలాగే డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు. పార్కింగ్ సౌకర్యం, విద్యార్థులు ఎక్కే-దిగే ప్రదేశాలు, రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు, పాఠశాల ప్రారంభం, ముగింపు సమయంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలను తనిఖీ చేశారు.

# రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఆసిఫ్ అలీని కలిసిన గుజ్జారి రాఘవేందర్



**తలకొండపల్లి జూలై 01(జనంసాక్షి):** రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా ఇటీవల నియమితులైన రేవంత్ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి.ఆసిఫ్ అలీ,ని తలకొండపల్లి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు,బీసీ జేఏసీ మండల అధ్యక్షులు గుజ్జారి రాఘవేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గుజ్జారి రాఘవేందర్ మాట్లాడుతూ..వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు,రాష్ట్రానికి ఉన్నతమైన సేవలను అందించి పదవికి వన్నె తేవాలని కోరారు.రాబోవు కాలంలో మరింత ఉన్నత పదవులను అలంకరించి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

# కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరసన

**నిజాంపేట్ జూన్1( జనం సాక్షి)**
కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్నదని దుండిగల్ గండిమైసమ్మ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి తెలిపారు. సిఐటియు దుండిగల్ గండిమైసమ్మ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గండిమైసమ్మ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు దుండిగల్ గండిమైసమ్మ మండల కన్వీనర్ లింగస్వామి మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహించే జాతీయ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి విబిజి రాంజీ పేరు పెట్టి నిధులు తగ్గించిందని దీనివలన కోట్ల మంది కార్మికులు ఉపాధికి నష్టం వస్తుందని తెలిపారు. ఉపాధి కూలీలకు ఇచ్చే వేతనంలో కేంద్రం తన వాటాను తగ్గించుకొని రాష్ట్రాల మీద భారం మోపే ప్రయత్నం చేస్తుందని అన్నారు. తక్షణమే నరేంద్ర మోడీ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే నిర్వహించాలని కోరారు ఇప్పటికే పనులు లేక ప్రజలు ఇబ్బంది



పడుతున్నారని పెరిగిన ధరలతో నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయలేక పస్తులతో ఉంటున్నారని తెలిపారు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని కోరారు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వివిధ రంగాలలో పనిచేసే కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు లింగం ప్రసాద్ ఎం రాజు ఎండి జాఫర్ రాజేష్ ఉపేందర్ చాంద్ పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య బలోపేతానికి సర్ కీలకం

**కరణం పురుషోత్తం రావు.**



**యాలాల జులై 1 (జనంసాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా బుధవారం యాలాల్ మండల కేంద్రంలోని బూత్ నంబర్ 199లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సర్ కన్వీనర్ కరణం పురుషోత్తం రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ముఖ్యమైనదని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా పారదర్శకంగా, ఖచ్చితంగా ఈ సవరణ ప్రక్రియ నిర్వహించబడుతు న్నదని తెలిపారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా సరిచేయడం, కొత్త అర్హుల పేర్లు నమోదు చేయడం, అనర్హుల పేర్లు తొలగించడం ఈ సర్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రతి బూత్ స్థాయిలో బిఎల్ఓలు, బిఎల్ఏలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలు కూడా తమ వివరాలను సరిచూసుకుని, అవసరమైన పత్రాలతో సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా తయారవుతు ందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నర్సిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, జిల్లా ఫిషరీస్ సహకార సంఘం అధ్యక్షుడు శ్రీదర్, సర్పంచ్ శివయ్య, ఉపసర్పంచ్ శోభారాణి మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్, సీనియర్ నాయకులు హనుమంతు, అమర్ నాథ్ రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, మల్లప్ప నర్సింలు సత్యనారాయణ రెడ్డి నాగప్ప బసవ రాజు శేఖర్ సతీష్ బిఎల్ఎలు మరియు బిఎల్ఓలు పాల్గొన్నారు.

# పంప్ ఆపరేటర్‌పై దాడికి పాల్పడ్డ ట్యాంకర్ డ్రైవర్ విధుల తొలగింపు

- **ఔట్సోర్సింగ్ ఉద్యోగిపై దాడికి పాల్పడ్డ ట్యాంకర్ డ్రైవర్ కఠిన చర్యలు తీసుకోవాలి**
- **హెచ్ఎం డబ్ల్యూ యు అండ్ ఎస్ కాంట్రాక్టడ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు నారాయణ**



**నిజాంపేట్ జూలై 1( జనం సాక్షి)**
కుతుబుల్లాపూర్ నియోజకవర్గ గాజులరామారం సర్కిల్ షాపూర్ నగర్ సెక్షన్, వార్డ్ 291 లో గల హెచ్ఎం డబ్ల్యూ ఎస్ అండ్ శివరేజ్ బోర్డు లో ట్యాంకర్లకు నీరు పంపించే ఆపరేటర్ గా ఔట్సోర్సింగ్ ఉద్యోగంతో గత 20 సంవత్సరాలుగా పి. కృష్ణ విధులు నిర్వహిస్తున్నాడు. ,నీటి ట్యాంకర్ కాంట్రాక్ట్ యజమాని ద్వారా డ్రైవర్ గా నియమింపబడిన నీటి ట్యాంకర్ వాహనం నెంబర్ టీజీ 13 టి 3025 అదే టాంకర్ వాహనంపై పనిచేస్తున్న డ్రైవర్ రవి మంగళవారం రోజువారి విధుల్లో భాగంగా నీటి కోసం జలమండలి కార్యాలయంకు వచ్చి ట్యాంకర్ లైన్ లో భాగంగా కొంత తగాదా ఏర్పడి అకారణంగా పంప్ ఆపరేటర్ కృష్ణ పై బూతులు తిడుతూ దాడికి పాల్పడడం జరిగింది. ఔట్సోర్సింగ్ ఉద్యోగి కృష్ణ దాడి విషయం యూనియన్ దృష్టికి తీసుకెళ్లడంతో హెచ్ఎం డబ్ల్యూ ఎస్ అండ్ కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ బిటి ఆర్ యు నాయకులు, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ పి నారాయణ నేతృత్వంలో మంగళవారం హెచ్ఎమ్ డబ్ల్యూ ఎస్ అండ్ ఎస్ బి డీజీఎం అధికారి రవి నాయక్ ను కలిసి విధి నిర్వహణలోని కృష్ణ పై దాడి చేసిన ట్యాంకర్ డ్రైవర్ పై చర్యలు ఖండిస్తున్నామని, ఆయనపై చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉంటుందని తెలియజేస్తూ డీజీఎం కు వినతి పత్రం అందజేశారు. అందుకు డీజీఎం సానుకూలంగా స్పందించి ట్యాంకర్ వాహన కాంట్రాక్టర్ యజమానిని పిలిచి దాడికి పాల్పడ్డ డ్రైవర్ రవిని ఇకపై జలమండలి వాటర్ పంపు విధులకు ఆయన రావద్దని సదరు కాంట్రాక్టర్ను తొలగిస్తున్నట్లు ఆదేశించారు, దీనితో కాంట్రాక్టర్ సైతం ఇకపై డ్రైవర్ రవిని రానివ్వనని విధుల నుంచి తొలగిస్తున్నట్లు తెలుపడంతో గొడవ సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ టియు ప్రధాన కార్యదర్శి బి కిరణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ ట్ సంతోష్, రాజారత్నం, రమేష్, రామకృష్ణ మహేష్ రెడ్డి, శ్రీనివాస్, రాము, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ

**కొడంగల్, జూలై01(జనం సాక్షి):**
కొడంగల్ మండలం అంగడి రాయిచూరు గ్రామములో ఓటరు సమగ్ర సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బిచ్చిరెడ్డి,ఎద్దు శ్రీనివాస్ రెడ్డి,శేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఇంటింటికి వచ్చే బి ఎల్ ఓ లకు ఓటర్లు సహకరించి,ఎన్యూమరేషన్ పత్రాలను తప్పులు లేకుండా పూరించి ఇవ్వాలని సూచించారు.



# వైద్యుల పట్ల గౌరవ భావం చిన్ననాటి నుంచే పెంపొందాలి మోహన్ చారి

## డా.బిధాన్ చంద్ర రాయ్ సేవాస్ఫూర్తి భావితరాలకు ఆదర్శం



**చేవెళ్ల, జూలై 01 (జనంసాక్షి) :** భారతరత్న డా.బిధాన్ చంద్ర రాయ్ సేవాస్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని, వైద్యుల పట్ల గౌరవ భావాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని సిల్వర్ డేల్ ఇంటర్నేషనల్ పాఠశాల కరస్పాండెంట్ మోహన్ చారి అన్నారు. బుధవారం చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన విద్యార్థులు వైద్యులకు శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మోహన్ చారి మాట్లాడుతూ... డా. బిధాన్ చంద్ర రాయ్ ప్రజారోగ్య రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన జయంతిని జాతీయ వైద్యుల దినోత్సవంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. అనంతరం డా. ప్రశాంత్ ఆరోగ్యకర జీవనశైలి, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించి, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సునీత రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో 'ఓజస్-2కె26'.. 30 కళాశాలల విద్యార్థులకు ఆహ్వానం




**సికింద్రాబాద్, జనం సాక్షి:** ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థుల్లోని సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, కళా ప్రతిభను ప్రోత్సహించేందుకు 'ఓజస్-2కె26' పేరుతో రెండు రోజుల కల్చరల్-అకాడమిక్ ఫెస్ట్‌ను జూలై 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో నగరంలోని సుమారు 30 యూజీ, పీజీ కళాశాలల విద్యార్థులను ఈ ఫెస్ట్‌లో పాల్గొనాలని ఆహ్వానించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరిగే ఈ ఫెస్ట్‌లో సృజనాత్మక కథల రచన, ఫోటోగ్రఫీ, డ్రాయింగ్-పెయింటింగ్, షార్ట్ ఫిల్మ్, జామ్ సెషన్, క్విజ్, సోలో డాన్స్, గ్రూప్ సింగింగ్, బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, ట్రెజర్ హంట్, ఫ్యాషన్ షో, పాలసీ ఇన్నోవేషన్, ప్రజెంటేషన్ తదితర సాహిత్య, సాంస్కృతిక, అకాడమిక్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాల చరిత్రలోనే తొలిసారిగా ఈ స్థాయిలో కల్చరల్-అకాడమిక్ ఫెస్ట్ నిర్వహించడం విశేషమని ప్రొఫెసర్ కాశీం తెలిపారు. అనంతరం జూలై 9న సాయంత్రం 5 గంటలకు ఆర్ట్స్ కాలేజీ డే వేడుకలను అదే ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, కళాశాల విద్య కమిషనర్ దేవసేన, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

# ఘనంగా పోతాయిపల్లిలో రేణుక ఎల్లమ్మ ఆలయ శంకుస్థాపన పూజలు



**శామీర్ పేట , జూలై 1(జనం సాక్షి)** :పోతాయిపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యం లో రేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానం శంకుస్థాపన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్య క్రమానికి రాష్ట్ర ఎమ్ పి పిల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లెపోయిన చంద్రశేఖర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా 11,000 వేల రూపాయలు విరాళాన్ని అందజేశారు. అనంతరం చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. ఆలయాలు ఆధ్యాత్మిక చైతన్యానికి, సామాజిక ఐక్యతకు ప్రతీకలు. రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాన్నారు . ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించి ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తూంకుంటకు చెందిన టి.ఆర్. రవీందర్ గౌడ్, పోతాయిపల్లి గ్రామ పెద్దలు, గౌడ సంఘం నాయకులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.